# మరుపురాని దీపావళి

★ గోడవర్తి భాస్కరరావు ★

ఈవేళా-నిన్నా జరిగిన సంగతికాదు. పదేళ్ల నాటి సంగతి. యింకామరుపురాకుండా ఉందా? పదేళ్ల నాటిసంగతి కదా అనుకోవచ్చును. అదినిజమే! కాని, అందుకే "మరపురాని" అనే విశేషణం.

ఆగడిచినరోజులు తలచుకుంటూంటే నిజంగా అంత ఆనందంగా జరిగాయా ఆ రోజులు అని పిస్తుంది ఇప్పుడు.

ఇంకాదీపావళి 10 రోజులుండనగానే స్నేహితులం కత్తులు, కఠారులు చేతధరించి యీ దొడ్డి మనది, యిది మనదికాదు, అనే అనుమానమయి నాలేకుండా మొండిధైర్యంతోకనుపించిన ప్రతిజిల్లేడు మొక్కనీ నరికి ఒకచోట ప్రోగుగా పడేసి యెండపెట్టి కాల్చి బొగ్గులు తయారుచేసేవాళ్ళం. మరి ఎలా పసికడతారో ఏమో, మాకార్యక్రమంలో మేం సొంతం మునిగిపోయివుంటే స్కూలు మాస్టర్లు హఠాత్తుగా ప్రత్యక్షమై కనుపించి చోటనే నిలబెట్టి మరపావాయించినట్లుగా నడ్డి చిట్లం కట్టేలా బాదేవాళ్లు. అయినా అమావాస్యసరదాలో ఆదెబ్బలుమాకు నాటేవికావు, ఎండలో తిరగడం చేత ఒళ్లునల్లగా మాడిపోయేది. మాస్టర్ల దెబ్బలతో నడ్డిమాడిపోయేది. దీపావళిపేరుతో అగ్గిపెట్టిలోదాచిన చిల్లరడబ్బులన్ని గంధకం, సూరేకారాలకూ బలై పోయేవి. దీపావళీ మరునాడు చూస్తే మతాబాపుల్లల అగ్గిపెట్టెలూ ఖాళీయే. డబ్బులు వేసిన అగ్గిపెట్టెలూ ఖాళీయే.

*     *     *

యింట్లోవాళ్ళకుతెలిస్తే కేకలేస్తారనే భయంతో తలుపులు తీసేటప్పుడు శబ్దం ఎవరిచెవులో పడుతుందో అనేఅలజడితో, ఏలాగైతేమొత్తం మీద తుమ్మి, దగ్గి, గదిలో మూలదాచిన మూకుళ్ళని తీనుకుని ఎవరికంటా పడకుండా యివతల పడేవాళ్ళం, అక్కడికి అదోయజ్ఞం క్రిందే ఉండేదిమాకు,

*     *     *

భోజనం చెయ్యాలి, స్కూలుకువెళ్లాలి, నిన్ననే వీపు చిట్లగొట్టేశారు మాష్టగారు అనైనా భయం ఉండేదిదికాదు అవునని- కాదని మొత్తంమీద మిత్రబృందం అందరం గుండెదిట్ట పరచుకొని మూకుడులో సూరేకారం, గంధకం, ఎండబెట్టి కాల్చిన జిల్లేడుబొగ్గు కాటికలాగనూరడం మొదలుపెట్టేవాళ్లం బెదురుతోనే- బెదురంటే సామాన్యమా- అమావాశ్యనాడు హఠాత్తుగా ప్లాను ప్రకారంగా, మందుగుండు సామానుతో దాడిచేయడానికి ప్లానువేసుకునిమందు తయారుచేసుకుంటుంటే ఏ స్కూలు మాష్టరులు మా రహస్య దీపావళీ మందుగుండు స్థావరాలని పట్టుకుంటారో- ఏ యింటి రిజర్వు పోలీసులు (అంటే మూలనున్న ముసలాళ్లులెండి) పట్టుకుంటారో అని అజ్ఞాతవాసంలోయున్న రాజకీయ వాదుల్లాగ దీపావళీ దాటేవరకూ ఎంతో బెదిరిపోతూ ఉండేవాళ్ళం. మొత్తంమీద ఎప్పుడూ- పట్టుబడలేదనే చెప్పాలి, అది మా స్నేహబృందంయొక్క దీపావళీ అర్గనైజేషననే చెప్పాలి, అక్కడికి మందులు నూరడం కూడా పూర్తి అయేది,

ఇంత పీకలుతెచ్చి జువ్వలు కట్టేవాడు ఒకడు. కాగితాలు చించి మతాబాలు కట్టేవాడు ఒకడు, కాలుతున్నాయో- లేదో కాల్చి చూచేవాడొకడు- ఎవరి పనులువారు 'కీ' యిచ్చిన మిషనుల్లాగ చకచకా పని చేస్తుండేవాళ్లు. హడావిడిలో ఒక జువ్వకి ఈన ఒదులుగాకట్టి కాల్చి పైకివేశాం, పైకి వెళ్లి వెళ్లడంతోటే ఈన క్రిందపడిపోయింది. జువ్వ మాత్రం ధ్వనిచేసుకుంటూ ప్రక్కనున్న గడ్డి మేటిలో పడింది. గడ్డిమేటి అంటుకుంది. పెద్దగా మంటలు బయలుదేరాయి. ఇంక యిక్కడుంటే లాభం లేదురాబాబూ, అని తిరిగి మా రహస్యస్థావరానికి పరుగుపరుగున చేరుకున్నాం. ఎల్లాగైతేమొత్తంమీద పల్లెటూరు అవడంచేత ఒకరికొకరు సహాయంగా బిందెలలో నీళ్లుపోసి మంటలని ఆర్పేశారు. అమ్మయ్యా! అనుకుని ఇవతలకు బయలుదేరి వచ్చాం,

మా అన్నయ్యలు. గడ్డిమేటితాలూకు వాళ్లు కేకలు వేసుకొంటున్నారు. ఆ దృశ్యం చూసే టప్పటికేచెమటలుపోశాయినాకు. అయినాఅన్నలు నా మూలంగా పేచీపడుతూంటే మనం యివతల ఉండడమా అని ప్రశ్నించుకుని రంగంలో ప్రవేశించాను. నాతోబాటు మా స్నేహబృందం.

నన్ను చూసీ చూడ్డంతోటే "బుద్ధుందా— లేదా కళ్లుమూసుకపోయాయా జాగ్రత్త"అన్నాడు. ఊడిపోతూన్న పంచని ఎగకడుతూ గడ్డిమేటి ఓనరు-

'బుద్ధీ గిద్ధీ రానివ్వకు-రొంత వెనకముందులు ఆలోచించి మరీమాటలు రానియ్యి జాగ్రత్త' అన్నాను నేను- మా అన్నయ్యలు నా కేసి ఖారంగా చూపులు సారించారు కాని అక్కడ మాత్రం నన్నేం అనలేదు. ఎల్లాగైతేం మాటకు మాట అందించి యింటికి చేరుకున్నాం,



డా. విలియమ్ కార్లస్ విలియమ్. అమెరికాలో ప్రసిద్ధికెక్కిన కవి.

---

అమ్మని అడిగి అరణాలు. అన్నలనడిగి నాలగణాలు, ముసలమ్మమ్మని అడిగి మూడు అణాలు ప్రోగుచేసి సీమసరకు కూడా కొన్నాం. తెల్లవారితే దీపావళి పంచదారతో జిలేబీ చేశారు మా యింట్లో ఈ వేళే మా అమ్మ మా అన్నదమ్ములందరినీ కేకేసి ఒక ఆర్డినెన్సుప్యాస్ చేసింది.

ఎవరి తోటీ పేచీలు పడవద్దనీ, ఉదయాన్నే అభ్యంగనాలు ఆచరించాలనీ, సీమ సరకు ఏమీ కొనకూడదనీ. అన్నలు అమ్మమాటలకు 'ఊ" కట్టారు? వారితోపాటు నేనూ డిటో అన్నాను.

తెల్లవారింది. అందరం తలంటి పీళ్ళు పోసుకున్నాము. కష్టపడి కట్టిన మందుసామాను అంతనీ ఎండలో పెట్టి కాపలా పెట్టాము. నేను గోగు కట్టలకోసం కుఱ్ఱవాళ్ళతో తోటలకేసి బయలుదేరి వెళ్లాను, సాయంత్రం 4 గంటల

యింది. గోగు కట్టలు పుచ్చుకొని అక్కడక్కడ అడిగేవాళ్లకి యిస్తూ యిల్లు చేరుకున్నాను

నా కోసం ఎదురుచూస్తున్న మా అమ్మ తొందరగా కాళ్ళుకడుక్కొని రా అంది. మా అన్నయ్య నేనూ మా తమ్ముడు అందరంకలిసి గోగుకట్టలు చేత్తోపట్టుకొని గుడ్డలు వెలిగించి మా యింటి ముందర వరసగా నిలబడి,

దిబూ దిబ్బూ దీపావళి
మళ్లీవచ్చే నాగులచవితీ.
ఎప్పుడు తిందుము చలిమిడి ముద్ద.
ఎప్పుడు తిందుము చిమ్మిలి ముద్ద.

అని గోగుకట్టలు నేలవేసి కొట్టి కాళ్ళుకడుక్కొని యింట్లోకివచ్చి ఆరోజున మాయింట్లో చేసినవంచదార నేతి జిలేబి తిన్నాము. రాత్రి పదింది. మా అమ్మ ఒదివలు ప్రమిదలలో చమురుపోసి అరుగులనిండా వరసలుదీర్చి అందంగా దీపాలు వెలిగిస్తున్నారు. పెద్దన్నయ్యగారి పిల్ల కుమారి బెదురుతూ టపాకాయలు కాలుస్తోంది. చిన్నన్నయ్యగారి అద్బాయి రాంప్రసాద్ సీమసరకు యింకా కావాలని హడావిడి చేస్తున్నారు యింక నేనూ తమ్ముడు కామేశ్వరరావూ తొడలాగులు తొడుక్కొని చేతిలోవిష్ణుతాడు పట్టుకొని ఎల్లాగైతే వీధిలో ప్రవేసించాం. మా తమ్ముడు మెల్లిగా మా పిన్నిగారి యింటికి వెళ్ళి నా కోసం ఎదురుచూస్తూ నుంచున్నాడు. యింకా నేను మా గుమ్మంలోనే తిప్పుడుపొట్లం తిప్పుతూన్నాను.

ఇక్కడ ఒక విషయం చెప్పాలి. పాపం, మాయింటికెదురుగుండగా కాపుర ముంటున్న ముసలి ముత్తైదువ సీతమ్మగారు ఎప్పుడుపెత్తనం వెళ్ళిందో ఏమో నేను మహాజోరుగా తిప్పుడు పొట్లం తిప్పుకొంటున్న సమయంలోనే సరిగ్గా పెత్తనం ముగించుకొని ముసలిది అవడంచేత అడుగులో అడుగు వేసుకొంటూ వస్తూంది. నే అవిడ్ని చూడలేదు. ఆవిడ నిశ్శబ్దంగా నన్ను చూడలేదు. వచ్చి వచ్చి నా దగ్గరగా వచ్చింది. యింకేం, చెప్పమంటారు. తిరుగుతూన్న ఎర్రటి నిప్పుతో నా తిప్పుడు పొట్లంవెళ్లి అప్పడం లాంటి ముసలమ్మ ముడ్డికి తగిలింది. 'బాబోయ్' అంది. నాకు ప్రాణాలు లేవు. అరుగులమీదవున్న వారంతా గబ గబా దిగివచ్చి అంటుకుంటూన్న చీరని ఆర్పి. ఆ విడ్ని యింటికిజేర్చారు. ఆహా ఏడిలో తుక్కిన పేనులాగ బ్రతికామురా జీవుడా అనుకొని నా కోసము ఎదురుచూస్తూన్న మా తమ్ముడివద్దకు చేరుకున్నాను. అప్పటికేస్నేహ బృందమంతా పోగైయుంది. అందరం కలిసి తిన్నగా నిర్ణయించుకొన్న చెరువుగట్టు మీదకు పెళ్లాం; కష్టపడికట్టిన మందుసామానంతా అందరం సరదాగా కాల్చాం, యింటికి చేరుకున్నాం. తెల్లవారింది స్కూలుకు చేరుకున్నాం. స్కూలు హెడ్‌మాస్టరుగారు చేత్తోబెత్తం తీసుకొనివచ్చి మమ్మలనందరినీ 'వరసగా నుంచోండి- చిట్టం కట్టున్నారు. దులుపుతా'నన్నారు. ఓ మూలనుంచి మాష్టరుగారు చితగబాదుతునే యున్నారు. ఈ మూలమేము కార్తీక పూర్ణిమికి ఏ సరకులు కావాలి, ఎంతడబ్బు అవుతుంది. అని- ప్లాను తయారు చేస్తున్నాము. అందరికీ సంభావన వడ్డించి మాష్టరుగారు నా వద్దకువచ్చి 'ఏం. యింకా దీపావళి బద్ధకం ఒదల్లేదా' అన్నారు. నేను ఇంకా ఏం మాట్లాడకముందే గబగబా అందరికన్నా నాలుగు అధికం మనపాటీసంభావనక్రింద చితకబాది వెళ్లిపోయారు. ఆ దెబ్బలన్నీ అక్కడే దులిపేశాం.

అదే విచిత్రం, బాల్యదశలోవుండే సృష్టివైపరీత్యం. ఇల్లాంటి అమావాశ్యని మరచిపోగలమా! "అందుకేమరపుకురాని అమావాశ్య" అయింది.